# ఫారెస్ట్ ఆఫీసులోనే మందు విందు!

- మీడియా రావడంతో పారిపోయిన అధికారులు?

జగిత్యాల, అక్టోబర్ 11 (నమస్తే తెలంగాణ) : ఫారెస్ట్ అధికారులు ఏకంగా కార్యాలయ ఆవరణలో దావత్ పెట్టారు. మందేసి విందు చేసుకున్నారు. శుక్రవారం మధ్యాహ్నం నుంచి దావత్ జరుగుతుందన్న విషయం తెలుసుకున్న మీడియా సిబ్బంది అక్కడికి వెళ్లగా, గమనించిన కొందరు అధికారులు పలాయనం చిత్తగించారు. మరికొందరు అక్కడే ఉండి వాదనకు దిగారు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. జగిత్యాల అటవీ శాఖ కార్యాలయం ఆవరణలోనే అటవీశాఖకు చెందిన కొందరు అధికారులు, సిబ్బంది శుక్రవారం మందు దావత్ ఏర్పాటు చేసుకున్నారు. మాంసం, మద్యంతో విందు మొదలు పెట్టారు. పలువురు బీట్ అధికారులు, ఇతర సిబ్బంది ఈ విందుకు హాజరైనట్లు సమాచారం. మధ్యాహ్నం ప్రారంభమైన విందు రాత్రి వరకు కొనసాగుతూనే వచ్చింది. కార్యాలయం ఆవరణలోనే అధికారులు, సిబ్బంది మందు తాగుతున్నారన్న విషయం బయటకు పొక్కడంతో మీడియా ప్రతినిధులు అటవీ శాఖ కార్యాలయానికి చేరుకున్నారు. గమనించిన అటవీ శాఖ అధికారులు అక్కడి నుంచి పలాయనం చిత్తగించగా, ఒక్కరిద్దరు అక్కడే ఉండి మీడియా ప్రతినిధులతో వాదనకు దిగారు. పోలీసులు సైతం అక్కడికి రావడంతో సిబ్బంది వెళ్లిపోయారు. కాగా, కార్యాలయం ఆవరణలోనే మందు విందుల విషయమై జిల్లా అటవీశాఖ అధికారి రవి ప్రసాద్‌ను సంప్రదించగా, తనకు మందు విందు సంగతి తెలియదని చెప్పారు. కాగా, విచారణ నిర్వహిస్తామని, వాస్తవమని తేలితే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. కాగా, అటవీశాఖ అధికారులు జిల్లా కేంద్రం నడిబొడ్డున కార్యాలయ ఆవరణలో బాహాటంగా మందు విందు చేసుకోవడం అందరినీ ఆశ్చర్యానికి గురి చేసింది. అటవీశాఖ అధికారులు గతంలో సైతం ఇలాంటి వ్యవహారాన్నే నిర్వహించడం అప్పట్లో సంచలనం సృష్టించింది. కాగా, అటవీశాఖ అధికారులు చేసుకున్న విందు కర్రకోత సామిల్ యజమానుల సహకారంతో జరిగినట్లు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.


అటవీశాఖ కార్యాలయం ఆవరణలో మద్యం సీసా, ప్లేట్లు




## చిత్తూ చిత్తుల బొమ్మ..


సారంగాపూర్ : బతుకమ్మ ఆడుతున్న మహిళలు

చిత్తూ చిత్తుల బొమ్మ.. శివుని ముద్దుల బొమ్మ.. బంగారు బొమ్మ దొరికెనమ్మ ఈ వాడలోన.. ఒక్కేసి పువ్వేసి చందమామ.. అంటూ మహిళలు ఆడిపాడారు. సారంగాపూర్, బీర్‌పూర్ మండల కేంద్రాలతోపాటు పలు గ్రామాల్లో శుక్రవారం బతుకమ్మ వేడుకలను వైభవంగా నిర్వహించారు. అందంగా పేర్చిన బతుకమ్మలను ముందు తమ ఇంటి ముందు వేసిన ముగ్గులో ఉంచి పాటలు పాడారు. అనంతరం ప్రధాన కూడళ్లకు తీసుకెళ్లి బతుకమ్మ ఆడారు. తర్వాత మహిళలు భక్తి శ్రద్ధలతో సత్తును వాయినాలుగా అందించి శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

-సారంగాపూర్, అక్టోబర్ 11




తుంగూర్‌లో బతుకమ్మలతో మహిళలు

## తాకట్టు పెట్టిన బంగారం ఇవ్వండి

- వడ్డీ వ్యాపారి ఇంటి ఎదుట బాధితుల బైఠాయింపు


బాధితులతో కలిసి జాతీయ రహదారిపై బైఠాయించిన నగల వ్యాపారి రాకేశ్

మెట్‌పల్లి రూరల్, అక్టోబర్ 11: తమ అవసరాల కోసం తాకట్టు పెట్టిన బంగారానికి వడ్డీతో సహా డబ్బులు చెల్లిస్తామని, తమ బంగారం తమకు ఇప్పించాలంటూ బాధితులు ఆందోళనకు దిగారు. బాధితుల కథనం ప్రకారం.. మెట్‌పల్లి పట్టణం కూరగాయల మార్కెట్‌లోని వరలక్ష్మి జ్యువెల్లర్స్ నిర్వాహకుడు రాకేశ్ వద్ద సుమారు 850 మంది ఎనిమిది కిలోల బంగారం తాకట్టుపెట్టి వడ్డీకి డబ్బు లు తీసుకున్నారు. ఆ బంగారాన్ని రాకేశ్ పట్టణంలోని కట్కం ప్రసాద్, కట్కం రమేశ్ అనే సోదరుల వద్ద తాకట్టు పెట్టి డబ్బులు తీసుకున్నాడు. వడ్డీలో లాభం పొందాలన్న దురాశతో తాకట్టు పెట్టి తెచ్చిన డబ్బులతో వడ్డీ వ్యాపారం నిర్వహిస్తున్నాడు. అయితే, గతంలో కట్కం ప్రసాద్, రమేశ్ అక్రమ వడ్డీ వ్యా పారం నిర్వహిస్తున్నారని వారి ఇళ్లలో తనిఖీలు చేసిన పోలీసులు బంగారం, వడ్డీ వ్యాపారానికి చెందిన పత్రాలను స్వాధీనం చేసుకున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో తాకట్టు పెట్టిన బంగారానికి వడ్డీతో సహా డబ్బులు చెల్లిస్తామని, తమ బంగారం తమకు అప్పగించాలని శుక్రవారం బాధితులు రాకేశ్ వద్దకు పెద్దఎత్తున తరలివచ్చారు. దీంతో బంగారాన్ని ప్రసాద్, రమేశ్ వద్ద తాకట్టుపెట్టి డ బ్బులు తెచ్చానని రాకేశ్ బాధితులకు చెప్పా డు. అనంతరం వారితో కలిసి ప్రసాద్, రమేశ్ ఇంటి వద్దకు వెళ్లి ఆందోళనకు దిగారు. డబ్బులు చెల్లిస్తామని తమ బంగారం తమకు తిరిగివ్వాలని ఇంటి ఎదుట జాతీయ రహదారిపై బైఠాయించారు. విషయం తెలుసుకున్న పోలీసులు బాధితుల వద్దకు చేరుకొని న్యాయం జరిగేలా చూస్తామని పేర్కొనడంతో ఆందోళన విరమించారు.

## ధర్మపురి టూ హైదరాబాద్ ఏసీ బస్

- ప్రారంభించిన ప్రభుత్వ విప్


ఏసీ బస్‌ను ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

ధర్మపురి, అక్టోబర్11 : ధర్మపురి నుంచి హైదరాబాద్‌కు ఏసీ బస్‌ను శుక్రవారం ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ధర్మపురి ప్రజల కోసం ధర్మపురి నుంచి హైదరాబాద్‌కు రాత్రి 11.30 గంటలకు ఏసీ బస్ సౌక ర్యం కల్పించినట్టు తెలిపారు. రాబోయే రోజుల్లో ధర్మపురిలో బస్‌డిపో ఏర్పాటుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.



# విజయోస్తు

- నేడు విజయదశమి
- ముస్తాబైన ఆలయాలు
- దసరా ఉత్సవాలకు సిద్ధమైన ప్రజలు

హిందూ సంప్రదాయంలో విజయదశమి విశిష్టమైన రోజు.. లోకాలను పాలించే జగన్మాత చేసిన రాక్షస సంహారానికి, చెడుపై మంచి సాధించిన విజయానికి చిహ్నంగా జరుపుకొనే పండుగ దసరా.. విజయాలను అందించే ఈ విజయదశమిని శనివారం ఘనంగా జరుపుకొనేందుకు జిల్లావాసులు సిద్ధమయ్యారు. ఆలయాలన్నింటినీ సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. పలుచోట్ల రామ్‌లీలా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆయా కాలనీలు, దుర్గామాత మండపాల వద్ద శమి పూజలు, వాహన పూజలు నిర్వహించనున్నారు.

- జగిత్యాల, అక్టోబర్ 11 (నమస్తే తెలంగాణ)

## తెప్పపై చిద్విలాసం

శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా వేములవాడ రాజన్న ఆలయంలో కొలువుదీరి తొమ్మిదిరోజులపాటు విశేషపూజలందుకున్న అమ్మవారు ఆలయ ధర్మగుండంలో తెప్పపై విహరిస్తూ చిద్విలాసం చేశారు. మంగళ వాయిద్యాలు, పటాకుల కాల్పుల నడుమ తెప్పోత్సవం నేత్రపర్వంగా సాగింది. ముందుగా అమ్మవారిని, ఉత్సవమూర్తులను సర్వాంగ సుందరంగా అలంకరించి ఆలయం నుంచి మేళ తాళాలతో ధర్మగుండం వద్ద హంసవాహనంతో ఉన్న తెప్పదగ్గరకు వేదమంత్రాల మధ్య పల్లకీలో తీసుకువచ్చారు. ధర్మగుండంలో ప్రత్యేకంగా పూలతో అలంకరించిన హంస వాహనంపై స్వామి, అమ్మవారిని ఉంచి ధర్మగుండంలో ప్రదక్షిణ చేస్తూ ఊరేగించారు.

-వేములవాడ టౌన్, అక్టోబర్ 11


ధర్మగుండంలో తెప్పపై జలవిహారం చేస్తున్న అమ్మవారు

# శుభా(పా)ల పిట్ట!



- అరుదైన.. అందమైన పక్షి పాలపిట్ట
- దసరా రోజు చూస్తే ఏడాదంతా మంచే జరుగుతుందనే విశ్వాసం

పాలపిట్ట.. ప్రకృతి అందమంతా తనలో నింపుకున్న పక్షి. విజయ దశమి రోజు దీనిని దర్శించుకుంటే ఏడాదంతా శుభాలే జరుగుతాయని పెద్దలు చెబుతారు. అందుకే దసరా రోజు జమ్మిచెట్టుకు పూజ చేసి, ఈ పిట్టను చూసేందుకు ప్రతిఒక్కరూ తహతహలాడుతుంటారు. ఈ పక్షి దర్శనం కోసం గ్రామ శివార్లకు వెళ్లి వస్తారు. ఇంతటి ప్రాధాన్యమున్న పాలపిట్టను ఐదు రాష్ట్రాల్లో అధికారిక పక్షిగా గుర్తించారు.

- జగిత్యాల, అక్టోబర్ 11 (నమస్తే తెలంగాణ)

## సిద్ధిధాత్రి అలంకరణలో అమ్మవారు



ధర్మపురి, అక్టోబర్ 7 : ధర్మపురి లక్ష్మీనరసింహస్వామి అనుబంధ ఆలయమైన శ్రీరామలింగేశ్వరాలయంలో దేవీనవరాత్రోత్సవాలు కొనసాగుతున్నాయి. తొమ్మిదో రోజు శుక్రవారం అమ్మవారు సిద్ధిధాత్రి అలంకరణలో దర్శనమిచ్చారు. భక్తులు దర్శించుకొని తరించారు.

◄ రామలింగేశ్వరాలయంలో సిద్ధిధాత్రి రూపంలో దర్శనమిస్తున్న అమ్మవారు






















